క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

డోర్నకల్/గార్ల/బయ్యారం/చిన్నగూడూరు/కురవి/కేసముద్రం/దంతాలపల్లి: ఎన్నికల కోడ్ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్య తీసుకుంటామని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్ రావు హెచ్చరించాడు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఉండటంతో కోడ్ నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. 144 సెక్షన్ అమలు, రెచ్చగొట్టే ప్రసంగాలు, ర్యాలీలు, డీజేలు, బాణాసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఎన్నికల కమిషన్ అనుమతితో విజయోత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.

నేడు లక్ష కార్తీక మహాదీపోత్సవం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన పారిజాతం, రాజేశ్వరరావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష కార్తీక మహాదీపోత్సవం నిర్వహిస్తున్నామని ఆహ్వాన నిర్వాహితులు మాలె నాగేశ్వరరావు, యోగీశ్వరరావు, లక్ష్మణరావు, శ్రవణ్ కుమార్, సమ్మారావు, నళిన్ కుమార్ శనివారం తెలిపారు. పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

కంటి వైద్యశిబిరం



గార్ల: శరత్ మ్యాక్స్‌విజన్ ఐ కేర్ ఆధ్వర్యంలో గార్లలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో కౌన్సిలర్ రవికుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ పృథ్వీ, సిబ్బంది పాల్గొన్నారు.

సీతక్క గెలవాలని పూజలు



గంగారం: మండలంలోని జంగాలపల్లి గ్రామంలోని ధనసరి వారి ఇలవేల్పు అయిన సడలమ్మ దేవాలయంలో ములుగు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి అనసూయ (సీతక్క)భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, అశోక్, సమ్మయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు

డోర్నకల్: డోర్నకల్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షులు కాలా సుమేర్‌చంద్‌జైన్, ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేసిన పోలీసులు, మున్సిపల్, ఎన్నికల సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అభ్యర్థి రాంచంద్రునాయక్ 20వేల మెజారిటీతో విజయం సాధిస్తాడని పేర్కొన్నారు.

మహాఅన్నదానం

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సహిత శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో శివస్వాములు, అయ్యప్పస్వాములకు శ్రీసాయి మార్కెటింగ్ బుక్ డిస్ట్రిబ్యూటర్ నిర్వాహకులు, దాత రేసు సత్తిరెడ్డి, సునీత దంపతులు శనివారం మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొంపెల్లి సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అలవాల ఉపేందర్, గురుస్వామి వల్లెం వీరస్వామి, దబ్బాక లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఓటర్లకు కృతజ్ఞతలు

బయ్యారం: ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు సహకరించిన ఓటర్లకు కాంగ్రెస్ నాయకుడు వడ్లమూడి సురేష్ శనివారం కృతజ్ఞతలు తెలిపాడు.

కోరం కనకయ్య గెలుపు ఖాయం



గార్ల: ఇల్లెందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపు ఖాయమైందని గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనకయ్యకు సుమారు 20వేల మెజారిటీ వస్తుందన్నారు.

కనీస సౌకర్యాలు కరువు

- శిథిలావస్థకు చేరుకున్న గార్ల రైల్వేస్టేషన్ భవనం
- తాళం వేసి ఉంటున్న ప్రయాణికుల విశ్రాంతి గది
- నీటిసౌకర్యం లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



గార్ల రైల్వేస్టేషన్



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



నిరుపయోగంగా ఉన్న కుళాయి



తాళం వేసి ఉన్న ప్రయాణికుల విశ్రాంతి గది

గార్ల: గార్ల రైల్వేస్టేషన్ దక్షిణ మధ్య రైల్వేకు ప్రతీఏటా సుమారు రూ. కోటి పైచిలుకు ఆదాయాన్ని సమకూర్చుతున్న రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనలో రైల్వే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన రైల్వేస్టేషన్ భవనంలోనే సిబ్బంది అరకొర వసతుల నడుమ విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనం వర్షం వస్తే చాలు కురుస్తుంది. సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకొని కూలిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

తాగునీటి కొరత

తాగునీటి అవసరాలు తీర్చేందుకు మినీ వాటర్ ట్యాంక్, బోరు, మోటారు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ కోసం సిబ్బందిని నియమించలేదు. దీంతో రైల్వేస్టేషన్‌లో తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 6ఏళ్ల క్రితం కొత్తగా మరుగుదొడ్లు నిర్మించిన నేటికీ నీటి సౌకర్యం కల్పించకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో మహిళలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యం కోసం వేచి ఉండు గది నిర్మించారు కాని గదిలో కూర్చునే కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేయకపోవడంతో వేచి ఉండు గది ఎప్పటికీ తాళం వేసి ఉంటుంది. వీటికి తోడు స్టేషన్‌లో కోతుల బెడద తీవ్రంగా ఉందని, కోతుల నివారణకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం బలమైన ప్రజా ఉద్యమాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ అసెంబ్లీ అభ్యర్థి భట్టు బిన్నమ్మ, ఎన్నికల కన్వీనర్ గౌని ఐలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బలమైన ప్రజాఉద్యమాల ద్వారానే తమ హక్కులను సాధించుకోగలమని అన్నారు. ప్రజా ఉద్యమాలకు ప్రజలు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పిన ఎన్నికల కమిషన్ డబ్బు పంపిణీ, అక్రమాలను అడ్డుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ప్రలోభాలాకు లొంగకుండా ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకుడు మండల వెంకన్న, పార్టీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, ఎన్నికల కోకన్వీనర్ హెచ్.లింగ్యా, నాయకులు గుజ్జు దేవేందర్, శివ్వారపు శ్రీధర్, భట్టు చైతన్య, బాబు, లింగయ్య పాల్గొన్నారు.

నేడు మద్యం షాపులు బంద్

మహబూబాబాద్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి సందర్భంగా జిల్లాలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు ఆదివారం ఉదయం నుంచే బంద్ చేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ నాయక్ శనివారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల కౌంటింగ్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యే వరకు మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుంటామని ఆయన పేర్కొన్నారు.

పాలకుర్తిలో గెలుపోటములపై బెట్టింగ్

పాలకుర్తి టౌన్ : పాలకుర్తి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోరు నెలకొంది. ఈ నేపథ్యంలో పాలకుర్తి కేంద్రంగా లక్షల్లో బెట్టింగులు వేసుకుంటున్నారు. ఫలితం అంచనాలు అందకపోడంతో కూడికలు, తీసివేతలు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఎవరు గెలుపొందుతారనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. దీంతో నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో బెట్టింగ్ రాయుళ్లతో పాటు సాధారణ వ్యక్తులు, మహిళలు సైతం బెట్టింగులు వేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. ఆయా పార్టీలకు ఎన్ని సీట్లు వస్తాయి. ఒకే పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా.. హంగ్ వస్తుందా.. అనే విషయాలపై బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు. మరో వైపు పాలకుర్తిలో ఎంత మెజారిటీ వస్తుంది. ఏ అభ్యర్థి రెండో స్థానంలో నిలుస్తారనే విషయమై వివిధ రకాలుగా బెట్టింగ్ నడుస్తుండడం గమనార్హం.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి ఆహ్వానం పలుకుతున్న సూపర్ వైజర్ రాణి

మరిపెడ రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని నీలికుర్తి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి అన్నారు. శనివారం మరిపెడ మండలం నీలికుర్తి సెక్టార్‌లోని మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరభ్యాసం చేసి, గర్భిణిలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమానికి హాజరైన సూపర్‌వైజర్ రాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గ్రామంలోని అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతో గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా పుడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కనకమ్మ, ఆయా సూర, బాలింతలు, గర్భిణులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

మానుకోటలో బీజేపీ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లు, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లు పాలించిందన్నారు. రెండు ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించాయన్నారు. సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి ఇంటింటికీ హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించానని, మానుకోట నియోజకవర్గ ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. మానుకోటకు ప్రధాని మోదీ రావడంతోనే బీజేపీ ఓటింగ్ శాతం పెరిగిందని, ఈ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ గెలిచి మానుకోట గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. తన గెలుపునకు కృషి చేస్తున్న బూత్ స్థాయి కార్యకర్తలకు, మండల స్థాయి అధ్యక్షులకు, జిల్లాస్థాయి నాయకులకు, మానుకోట ప్రజలకు, యువకులకు, మహిళలకు, సహకరించిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, మానుకోట ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. మానుకోటలో స్థానికులే గెలుస్తారని, స్థానికేతరులను ప్రజలు గుర్తించి ఓటమికి గురి చేస్తున్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే మానుకోటకు సేవ చేసే రుణం తీర్చుకుంటానన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్ రావు, జిల్లా కోశాధికారి శ్యాంసుందర్ శర్మ, జిల్లా నాయకులు రాంబాబు నాయక్, వెంకన్న, గద్దం అశోక్, అజయ్, ఆకుల శ్రీనివాస్, సందీప్, పద్మ, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన కమ్మగాని సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను ఇచ్చారు. అందజేసిన వారిలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కార్యదర్శి జీడి హరీశ్‌లు బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాధితులకు సహకారం అందించేందుకు సహకరించిన గంగు ఫణీంద్రశర్మకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మగాని సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



దేవరుప్పుల : మండలంలోని ధర్మగడ్డతండా పరిధి దోనెబండ తండాకు చెందిన లాకావత్ వెన్నెలకు పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌లో ప్రసవం కోసం చంపక్‌హిల్స్ ఎంసీహెచ్‌కు తరలించారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా 108 సిబ్బంది మెరుగైన చికిత్సలు చేయడంతో మార్గమధ్యలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ ప్రసవం కోసం పాటుపడిన ఈఎంటీ మల్లేష్, పైలెట్ నజీర్ పాషాలను తండావాసులు అభినందించారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్నాం..



నెల్లికుదురు: మాట్లాడుతున్న ప్రభాకర్ గౌడ్

నెల్లికుదురు: జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి మానుకోట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో నడుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభార్ గౌడ్ కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో శనివారం నాయకులతో కలిసి నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లారు. ఎన్నికల సమయంలో మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళి నాయక్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేసిన కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గుట్టయ్య, వైస్ ఎంపీపీ వెంకటేష్, నాగరాజు, బాలాజీ నాయక్, మల్లయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

కురవి: డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం అని సీపీఐ నియోజకవర్గ పార్టీ కార్యదర్శి, జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 20 రోజులుగా పార్టీ కార్యకర్తలు పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాంచంద్రునాయక్ గెలుపు కోసం పనిచేశారని, కార్యకర్తలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతన్నలకు 'మిచాంగ్' గుబులు

సంగెం : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికి వచ్చేదేలా? అని అన్నదాతలకు ఆందోళన మొదలైంది. మిచాంగ్ తీవ్ర తుపాన్ ప్రభావం కారణంగా మబ్బులు పట్టడంతో రైతులకు మరింత గుబులు పట్టుకుంది. సంగెం మండలంలో వరి కోతలు కొనసాగుతున్నాయి. వాన మబ్బులను చూసి రైతులు వరి ధాన్యం కల్లాల్లో తడవకుండా రాసులు పోసుకుంటున్నారు. సంగెం, కుంటపల్లి, ఎల్గూర్‌రంగంపేట, కాపులకనిపర్తి, వెంకటాపూర్, కాట్రపల్లి, ఆశాలపల్లి, మొండ్రాయి, నల్లబెల్లి, పల్లారుగూడ తదితర చెరువుల కింద సాగు చేసిన వరి కోతకు వచ్చింది. అలాగే కోసిన ధాన్యంను ఎలా కాపాడుకోవాలో అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వాన నుంచి కాపాడుకోవడానికి సరిపోను టార్పాలిన్లు షీట్లు లేక ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ తీవ్రత ఎక్కువై అకాల వర్షం కురిస్తే అన్నదాతలకు భారీ నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళనతో ఆకాశం వైపు దీనంగా చూస్తు రోదిస్తున్నారు.

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న కవిరాజు

నెల్లికుదురు: జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కవిరాజు మాట్లాడుతూ.. పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. దీనివల్ల భవిష్యత్ తరాలు ప్రమాదంలో చిక్కుకునే ప్రమాదాలు ఉన్నాయన్నారు. సకల సృష్టికి జీవనాధారమైన గాలి, నీరు కలుషితం చేసుకుంటూ పోతే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. దీనిపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన పెంచుకొని అందరికి అవగాహన కల్గించే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పంపిణీ చేసిన పుస్తకాలతో బాలికలు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ సామాజికవేత్త, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శనివారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష పుస్తకాలను, పెన్నులను ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్, గైడెన్స్ వివరాలకు ఫోన్ నంబర్ 99893 10141లలో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సునీత, గిరిజ, శ్రీవాణి, వసంత, విజయకుమార్, సుచిత్ర, సునీత, సంజీవ, విజయలక్ష్మి, మంజుల, రాణి, సంధ్యారాణి, శ్వేత, రజియా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన సత్యానందం అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ మర్రి నారాయణరావు, మిత్రులు కలిసి రూ.22,500 బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మహ్మద్‌అలీ, వోలం ఉపేందర్, లక్కాకుల నర్సయ్య, చంద్రయ్య, ఇంద్రారెడ్డి, లక్ష్మయ్య, సత్యం, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ కోచ్ సట్ల భిక్షపతికి శనివారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ కేసముద్రం ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, మామిడి అశోక్, డాక్టర్ చంద్రశేఖర్, పరాంకుశం శ్రీహరి, చింతా కరుణాకర్, శ్రీరాములు, వెంకట్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు



వరి కోస్తున్న హార్వెస్టర్ యంత్రం

ఖానాపురం : పచ్చని మగాణిలో సిరులు కురిసింది.. అన్నదాతల ఆశల పంట పండింది.. ఆరుగాలం కష్టపడి పండించిన వరిచేలు కోతకు వచ్చాయి. దీంతో మిషన్లను అద్దెకు తెచ్చి కోతలు షురూ చేశారు. పాకాల ఆయకట్టు పరిధిలో రైతులు వరి కోతలను ముమ్మరం చేశారు. ఆయకట్టు పరిధిలో 29,500 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. రైతులు సన్న రకాలను అధికంగా సాగు చేయడంతో ప్రైవేటు వ్యాపారులు సన్న ధాన్యాన్ని జోరుగా కొనుగోలు చేస్తున్నారు. ప్రారంభ దశలో సన్న ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేయగా ప్రస్తుతం ఆరబెట్టిన తర్వాత ధాన్యాన్ని మద్దతు ధరకంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జై శ్రీరాం వంటి రకాలను రూ.3వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు సన్న రకాలను అధికంగా కొనుగోలు చేస్తుండడంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు విక్రయించుకోవడానికి ముందుకు రావడం లేదు. కేవలం దొడ్డు రకాలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప దివ్య పడిపూజ



అయ్యప్పస్వామి ఆలయంలో 18మెట్లకు పూజలు చేస్తున్న అర్చకులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో శనివారం పుష్పాభిషేకం, దివ్య పడిపూజ, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్య పడిపూజ, మహా అన్నదాతలుగా మాలె రవి,సరిత వ్యవహరించగా ఆలయ నిత్య అర్చకులు దేవేష్‌మిశ్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలే సుజాతకనకయ్య, గన్నేపల్లి కృష్ణమూర్తి, వేంశెట్టి శ్రీనివాస్, దొండేటి శ్రీనివాస్‌రావుసుజాత, పొన్నం గణేష్‌మౌనిక, నల్ల నరేందర్‌విజయలక్ష్మి, నల్ల సుధాకర్‌రెడ్డిభారతి, వడ్డేపల్లి సారంగపాణినీరజ, సంతోష్‌హరిణి, రాజేష్, సురేష్, దార ప్రశాంత్‌మలత, మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, శ్రీరాంఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన హోంగార్డు వడ్డెబోయిన రాజ్‌కుమార్ ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబానికి శనివారం గ్రామ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన ఎస్సై మండల ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ కెత్తె వీరేందర్, దిడ్డి భాస్కర్, సముద్రాల శ్రావణ్ పాల్గొన్నారు .